క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లిరూరల్ : మంగళగిరి రూరల్ ప్రాంత పరిధిలోని పెదవడ్లపూడి గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ అక్కుల సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదవడ్లపూడి గ్రామ పరిధిలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు నిమిత్తం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని సూచించారు.

భూ రికార్డులు వెంటనే అందజేయండి

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : దుగ్గిరాలలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న రీ సర్వేకు తమ భూ రికార్డులను సచివాలయాల్లో అందజేయాలని దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. దుగ్గిరాల మండలంలో భూములు ఉన్న చాలామంది రైతులు ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్నారని, మండల వ్యాప్తంగా వైఎస్సార్ జగనన్న భూహక్కు భూ రక్ష పథకం ద్వారా సర్వే నిర్వహిస్తున్నామని, ఇతర ప్రాంతాల్లో ఉన్న రైతులు కూడా తమ పంటపొలాలకు సంబంధించిన రికార్డులను, ప్రభుత్వానికి చెల్లించాల్సిన భూ శిస్తు, నీటితీరువాను గ్రామ సచివాలయాల్లో చెల్లించి రశీదు పొందాలని, రీ సర్వే చేయించుకున్న అనంతరం ప్రతి రైతుకూ ప్రత్యేక యూనిక్ నంబర్ ఇస్తారని, అందరూ సహకరించాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు.

ఎయిమ్స్‌కు బస్సు సర్వీసును ఏర్పాటు చేయండి

తెనాలిఅర్బన్: మంగళగిరిలోని ఎయిమ్స్ హాస్పిటల్‌కు బస్సు సర్వీసును ఏర్పాటు చేయాలని సేవాభారతి నాయకులు ఆదివారం తెనాలి ఆర్టీసీ డిపో ఉన్న మేనేజర్ రాజశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెనాలి ప్రాంతం నుంచి ఎంతో మంది ఎయిమ్స్ హాస్పిటల్‌కు వైద్య నిమిత్తం వెళ్తున్నారని చెప్పారు. వారిలో ఎక్కువ మంది పేద, మధ్యతరగతి వారని, సొంత వాహనాలు లేక మంగళగిరి వరకు బస్సులో వెళ్లి అక్కడి నుంచి ఆటోలలో వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. దీనివలన పేదలపై ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సేవా భారతి తెనాలి అధ్యక్షులు వి.లక్ష్మీనారాయణ, కార్యదర్శి పరిమి నటరాజ్, నాయకులు ఎ.మధుసూదనరావు, వి.గోపికృష్ణ, కె.నవీన్‌కుమార్, డి.శశాంక్, ఎం.గంగావిష్ణేశ్వర్, వై.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అమరావతి కాలనీ సంక్షేమ సంఘ సమావేశం



తెనాలిటౌన్: అమరావతి కాలనీ గృహ యజమానుల సంక్షేమ సంఘ సర్వ సభ్య సమావేశం కాలనీలోని కమ్యూనిటీ సెంటర్ వద్ద ఆదివారం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్ మాట్లాడుతూ అమరావతి కాలనీలో మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. 2023–25 మధ్య కాలానికి సంఘ కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుమ్మడి నారాయణరావు, ఉపాధ్యక్షుడిగా కె.జయపాల్, ప్రధాన కార్యదర్శిగా జి.పూర్ణచంద్రరావు, ఫైనాన్స్ సెక్రటరీ జగన్మోహనరావు, జాయింట్ సెక్రటరీ రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడిగా సిద్ధయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వెదురు కర్రలు పంపిణీ



తెనాలిటౌన్: పట్టణంలో మేదర కులస్తులకు మేదర హ్యాండ్ క్రాఫ్ట్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.25వేలు విలువగల వెదురు కర్రలను ఆదివారం అందజేశారు. మార్కెట్ సెంటర్ సమీపంలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ మార్కెటింగ్ డైరెక్టర్ కొండా భానుశ్రీనివాస్ వెదురు వృత్తి మీద జీవిస్తున్న కొన్ని కుటుంబాల వారికి ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ మేదర సంఘ ప్రెసిడెంట్ తమ్మినేని రాఘవేంద్ర, సెక్రటరీ గజపనేని రెడ్డమ్మ, మేదర వర్గీయులు పాల్గొన్నారు.

తిరుమవలన్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు



తెనాలిఅర్బన్: గుంటూరులో జరగనున్న బీపీ మండల్ కాంస్య విగ్రహావిష్కరణలో పాల్గొనేందుకు తెనాలి రైల్వేస్టేషన్‌కు ఆదివారం తెల్లవారుజామున వచ్చిన తమిళనాడులోని విదుతలై చిరుతైగల్ కచ్చి పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఎంపీ తిరుమవలన్‌కు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గెడ్డేటి సురేంద్ర, పలువురు దళిత నాయకులు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి ఆయనను ర్యాలీగా గుంటూరు తీసుకువెళ్లారు.

మచ్చలేని వ్యక్తి ఎమ్మెల్యే ఆర్కే

- అభివృద్ధిపై విమర్శించే హక్కు టీడీపీకి లేదు
- మంగళగిరి నియోజకవర్గం ఎప్పుడూ లేని ప్రగతిని చూసింది
- కళ్లు తెరచి చూడండి.. వైఎస్సార్ సీపీ నాయకుల హితవు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ మునగాల మల్లేశ్వరరావు, నాయకులు

తాడేపల్లిరూరల్ (మంగళగిరి): మంగళగిరి శాసన సభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) మచ్చలేని మహానాయకుడని, ఆయనను విమర్శించే హక్కు టీడీపీ నాయకులకు లేదని వైఎస్సార్ సీపీ నాయకులు స్పష్టం చేశారు. ఆదివారం మంగళగిరి ఆటోనగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ మంగళగిరి పట్టణ కన్వీనర్ మునగాల మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. టీడీపీ పాలనలో ఏ పని చేసినా కమీషన్లకు కక్కుర్తి పడ్డారని, అందరూ వారిలాగే ఉంటారనుకుని ఇప్పుడు ఎమ్మెల్యే ఆర్కేపై అవాకులు, చెవాకులు పేలుతున్నారని ధ్వజమెత్తారు. నియోజకవర్గాన్ని గతంలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా ఆర్కే అభివృద్ధి చేస్తున్నారని ప్రశంసించారు. మంగళగిరికే తలమానికమైన 450 ఏళ్ల చరిత్ర కలిగిన పుష్కరిణి(పెద్ద కోనేరు) అభివృద్ధికి అహర్నిశలూ కష్టపడుతున్నారని, ఎమ్మెల్యే పని తీరును అభినందించాల్సింది పోయి టీడీపీ నేతలు లేనిపోని ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటి వరకు కోనేరులో తీసిన పూడిక మట్టిని నాలుగు కాళ్ల మండపం దగ్గర పోశారని, దానిని క్షుణ్ణంగా పరిశీలించి ఏమైనా నిక్షేపాలు, నిధులు ఉంటే అవి ప్రభుత్వానికి అప్పజెబితే టీడీపీ నాయకులకు ప్రజలు ధన్యవాదాలు తెలియజేస్తారని చెప్పారు. నియోజకవర్గంలో గతంలో నివాసమున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నాలుగు శాఖల మాజీ మంత్రి లోకేష్ ఈ ప్రాంత అభివృద్ధిని పట్టించుకోలేదని, అందుకే ప్రజలు బుద్ధి చెప్పారని, లోకేష్ పోటీచేసినా ఆర్కేకే పట్టం కట్టారని వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే ఆర్కే నియోజకవర్గ వ్యాప్తంగా రూ.900 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేశారని వివరించారు. గౌతమ బుద్ధ రోడ్, పెద్ద కోనేరు, రత్నాల చెరువు రోడ్డు, నవులూరు రోడ్డు, నిడమర్రు–తాడికొండ రోడ్డు, నంబూరు, ఈమని రోడ్లతోపాటు నూతక్కి నుంచి చిర్రావూరు మీదుగా కుంచనపల్లి వరకు బీటీ రోడ్డు, డొంకరోడ్లనూ ఆర్కే అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. పులిని చూసి నక్క వాతపెట్టుకున్నట్లు లోకేష్ పాదయాత్ర ఉందని ఎద్దేవా చేశారు. టీడీపీ నేతలు పోతినేని శ్రీనివాసరావు, నందం అబద్దయ్య లోకేష్ టీమ్ నుంచి వచ్చిన స్క్రిప్టును చదువుతున్నారని, కళ్లు తెరిచి ప్రగతిని చూడాలని వైఎస్సార్ సీపీ నేతలు హితవు పలికారు.

ఆర్కేపై ప్రెస్‌మీట్లు పెట్టిన ప్రబుద్ధులు భూములను ఆక్రమిస్తే వాటిని అర్హులకు అప్పగించిన ఘనత ఆర్కేదని, ఆ అక్కసుతోనే టీడీపీ నేతలు ఆరోపణలు చేస్తున్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ యూత్ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, పట్టణ మహిళా అధ్యక్షులు సునీత, మార్కెట్ యార్డ్ చైర్మన్ మునగాల భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు సంకె బాలాజీ గుప్త, ఎండీ ఫిరోజ్, మల్లవరపు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.


నాణ్యతను ఎవరైనా పరిశీలించవచ్చు



బీటీ రోడ్డును పరిశీలిస్తున్న డీఈ కృష్ణారెడ్డి

తాడేపల్లిరూరల్ : మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల నాణ్యతా ప్రమాణాలను ఎవరైనా పరిశీలించవచ్చని కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం తెల్లవారుజామున పాత టోల్‌గేట్ దగ్గర నుంచి భరతమాత సెంటర్ వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్ 2వ లేయర్ పనులను ఆయన పరిశీలించారు. గత ఆరు రోజుల నుంచి ఈ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామని, రోడ్డుపై వర్షపు నీరు నిల్వకుండా రెండువైపులా డ్రెయినేజ్‌లోకి వెళ్లేవిధంగా రోడ్డు నిర్మాణం చేపట్టామని, అందువల్లే రెండు లేయర్లు వేస్తున్నామని, మొదటి లేయర్ వేసే సమయంలో వాహనాలు తిరగడం వల్ల కొంత భాగం పోయిందని, రెండో లేయర్‌లో దానిని సైతం సరిచేసి నిర్మాణ పనులు చేపట్టామని, నాణ్యత విషయంలో ఎటువంటి అనుమానాలు ఉన్నా పనులను ఎవరైనా పరిశీలించవచ్చని వివరించారు.

మంగళగిరి పంప్‌హౌస్‌లో క్లీనింగ్ కార్యక్రమం



మంగళగిరి పంప్‌హౌస్‌లో ఫిల్టర్ బెడ్ వద్ద క్లీనింగ్ చేస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

తాడేపల్లిరూరల్ : మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో తాగునీటిని అందించే ఫిల్టర్ బెడ్ వద్ద ఆదివారం కార్పొరేషన్ ఇంజినీరింగ్, పంప్‌హౌస్ సిబ్బంది, ఇతర పారిశుద్ధ్య కార్మికులు క్లీనింగ్ కార్యక్రమం చేపట్టారు. పంప్‌హౌస్ ఫిల్టర్ బెడ్‌లో ఉన్న వ్యర్థాలను తొలగించడంతోపాటు పంప్‌హౌస్‌లోని ఫిల్టర్లను, ఇతర సామగ్రిని, పంప్‌హౌస్ లోపల ఉన్న పాత సామాన్లను తొలగించి విద్యుత్ పరికరాలను శుభ్రం చేసి మరమ్మతులు చేశారు. ఉదయం 6 గంటల నుంచి 12 గంటల వరకు 15 మంది సిబ్బంది పనిచేయడంతో క్లీనింగ్ పనులు పూర్తయినట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

వైభవంగా భావనారుషి కల్యాణం



భావనారుషి కల్యాణంలో పాల్గొన్న పాత మంగళగిరి పద్మశాలీయ సంఘం సభ్యులు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలోని భద్రావతి సమేత భావనారుషి స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవస్థానంలో స్వామి వారికి 16 రోజుల పండగ పూజా కార్యక్రమాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి జరిగిన పవళింపు సేవా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవస్థానం ఏర్పాటు చేసిన హరే శ్రీనివాసా కోలాటం, భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. భావనారుషి స్వామికి కైంకర్యపరులు చింతక్రింది కళ్యాణ్‌కుమార్ కుటుంబ సభ్యులు, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ మునగాల భాగ్యలక్ష్మి, మునగాల మల్లేశ్వరరావు, అందె శివశంకరరావు, శ్రీపాత మంగళగిరి పద్మశాలీయ సంఘం అధ్యక్షులు పూట్ల పాల శ్రీనివాసరావులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద శ్రేష్ఠులు తిరువీధుల కృష్ణాంజనేయులు, కాండ్రు అమరలింగేశ్వరరావు, మునగాల రామారావు, పూట్ల రథంగపాణి, తుమ్మా నరిసింహమూర్తి, శ్రీపాత మంగళగిరి పద్మశాలీయ సంఘం సెక్రటరీ చిట్రా శ్రీనివాసరావు, కోశాధికారి జొన్నాదుల గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు జగ్గారపు వెంకట నారాయణ, జంజనం దుర్గారావు, కార్యదర్శులు గుడిపూడి శివకృష్ణ, మునగాల ధనంజయుడు, మునగాల వేణుకుమార్, సభ్యులు కాటాబత్తుల అంజయ్య, తేలు వెంకటేశ్వరరావు, కారంపూడి గోపాలరావు, గుంటి నాగరాజు, మాచర్ల శ్రీనివాసరావు, చింతక్రింది వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి 7.5 కేజీల వెండి ఆభరణాలు



దాతలు అందజేసిన వెండిచీర, మకరతోరణంతో అలంకృతులైన అమ్మవారు

తాడేపల్లిరూరల్ : పెద్దవడ్లపూడి గ్రామంలో వేంచేసిన గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో అమ్మవారికి ఆదివారం దాతలు 7.5 కేజీల వెండితో చేసిన చీర, మకర తోరణం పీఠం అందజేశారు. భావన బాపయ్య మాట్లాడుతూ తన కుమార్తె, నన్నపనేని వెంకటేశ్వర్లు ధర్మపత్ని బాలరత్నం సహకారంతో సుమారు ఆరు లక్షల రూపాయల ఖర్చుతో 7.5 కేజీల వెండితో చేసిన చీర, మకర తోరణం, పీఠం అందించామని వివరించారు. దాత ఇచ్చిన ఆభరణాలను అమ్మవారికి అలంకరించి అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో నన్నపనేని బాలరత్నం, అన్నే అన్నపూర్ణ, జవ్వాది సామ్రాజ్యం, భావన వెంకటేశ్వరరావు, మాదాల రమేష్, నాగళ్ళ వెంకట్రావు, ఆవుల బసవ పున్నయ్య, భావన బాబు, జువ్వాది సుభాషిణి, భావన పున్నయ్య, జవ్వాది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చోరీ సొత్తు రికవరీ



రికవరీ చేసిన సొత్తు, నిందితుడితో సీఐ అల్తాఫ్ హుస్సేన్, ఎస్ఐ లక్ష్మీనారాయణరెడ్డి

ఫిరంగిపురం: బస్సులో ప్రయాణిస్తున్న మహిళ నుంచి నగదు, బంగారు నగలు చోరీచేసిన ఘటనలో యువకుడిని అరెస్ట్‌చేసి అతడి వద్ద నుంచి వాటిని రికవరీ చేసినట్లు సీఐ షేక్ అల్తాఫ్‌హుస్సేన్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ షేక్ అల్తాఫ్‌హుస్సేన్ కేసు వివరాలు వెల్లడించారు. ఈనెల 10న కూసం అలేఖ్య కర్నూలు నుంచి గుంటూరుకు బస్సులో వెళ్తుండగా తెల్లవారుజామున నిద్రలో ఉన్న సమయంలో ఆమె బ్యాగును ఎవరో దొంగిలించారు. దీంతో ఆమె ఫిరంగిపురం వద్ద బస్సు దిగి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బ్యాగులో బంగారు నగలు, నగదు ఉన్నాయని చెప్పడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గుంటూరు బస్టాండ్ వద్ద ఒక యువకుడు అనుమానాస్పదంగా సంచరిస్తున్నాడనే సమాచారంతో ఎస్ఐ ఎం.లక్ష్మీనారాయణరెడ్డి తన సిబ్బందితో వెళ్లి అతడిని ప్రశ్నించడంతో చోరీ చేసినట్లు అంగీకరించాడు. నిందితుడిని కృష్ణాజిల్లా మచిలీపట్నానికి చెందిన రెడ్డి రామకృష్ణగా గుర్తించారు. అతడివద్ద నుంచి బంగారు గాజులు, నల్లపూసల గొలుసు, లక్ష్మీదేవి డాలరు, రూ.20వేల నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ లక్ష్మీనారాయణ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వైద్యంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ప్రకాశం జిల్లా రవాణా శాఖ ఉప కమిషనర్ డాక్టర్ శ్రీకృష్ణవేణి

వల్లభాపురం(కొల్లిపర): నేటి సమాజంలో ప్రజలు ప్రకృతి వైద్యం, యోగా, సంప్రదాయాలపై అవగాహన పెంచుకోవాలని ప్రకాశం జిల్లా రవాణా శాఖ ఉప కమిషనర్ డాక్టర్ బి.శ్రీకృష్ణవేణి అన్నారు. ఆదివారం మండలంలోని వల్లభాపురం గ్రామంలో వినాయస్వామి ఆలయ 111వ వార్షికోత్సవంలో ముఖ్యఅతిథులుగా పాల్గొని ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు దేవాలయ వ్యవస్థ ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు అనేక సామాజిక కార్యక్రమాలలో పాలుపంచుకోవటం విశేషమన్నారు. గ్రామీణ యువత సివిల్స్, గ్రూపులకు హాజరవ్వాలనుకుంటే తన లాంటి ఎందరో తమ ఖాళీ సమయాలలో ఉచితంగా గైడెన్స్ ఇవ్వగలమని సూచించారు. గణాంకాల శాఖ రిటైర్ట్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.ప్రసాదరావు మాట్లాడారు. తొలుత ఆలయంలో విశ్వశాంతి యజ్ఞం (శాంతి హోమం), సుందరకాండ పారాయణం నిర్వహించారు. కార్యక్రమాల అనంతరం ముఖ్య అతిథులను గ్రామ పెద్ద బొమ్మారెడ్డి సాంబిరెడ్డి చేతుల మీదుగా వారిని శాలువాలతో, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దేవాలయ వ్యవస్థాపక సభ్యురాలు లలిత కుమారి, ఆలయ ధర్మకర్త అచ్యుత ఇందుశేఖర్, వేద ప్రచారకులు శ్రీగొడవర్తి కోటేశ్వరరావు, పారాయణ కర్త చిర్రా విష్ణువర్ధనరెడ్డి, అచ్యుత ప్రభాకరబాబు, ఉల్లంగటి శ్రీనివాస్, దేవాలయ అర్చకుడు నందివెలుగు సత్యసాయి, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి దాతల సహకారం మరువలేనిది

తెనాలిటౌన్: షరాఫ్ బజార్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుతగా ఆలయ అభివృద్ధికి, మరమ్మతులకు సహకరించిన దాతలను ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ, ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసారెడ్డి, వంశపరంపర్య అర్చకుడు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి అభినందించి జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా ఎస్‌బీ శివ మాట్లాడుతూ ఎంతో విశిష్టమైన పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి సహకరించడం సంతోషకరమన్నారు. ఆలయంలో విశేషంగా పూజలు నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సేవా సమితి అధ్యక్షులు ఆర్‌వీ కిరణ్‌కుమార్, సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, గుడివాడ బాలకృష్ణ, బచ్చు లీలాప్రసాద్, ఆర్.సురేష్, మాజేటి వెంకటేష్, పల్లపోతు మురళి, కె.రాజశేఖర్, కొల్లూరు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

తహసీల్దార్లతో తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి



తహసీల్దార్ల సమీక్షలో మాట్లాడుతున్న తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి

తాడికొండ: నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న జగనన్న ఇళ్ళ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి సూచించారు. ఆదివారరం గుంటూరులోని తన కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఇళ్ళ స్థలాల కోసం లబ్ధిదారులు పెట్టుకున్న అర్జీల గురించి అడిగి తెలుసుకొని స్థలాల కోసం ఎక్కువ మంది ఉన్న చోట స్థల సేకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం లే అవుట్లలో మిగిలి ఉన్న ప్లాట్ల వివరాలు అడిగి అర్హులకు అందజేయాలని సూచించారు. టిడ్కో ఇళ్ళ నిర్మాణాల వద్ద జరుగుతున్న పనుల పైనా ఆరా తీసి వేగవంతం చేయాలని సూచించారు. గడప గడపకు కార్యక్రమంలో రెవెన్యూ సంబంధ సమస్యలపై వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. సమగ్ర సర్వే వివరాలు తెలుసుకొని రైతులకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నిర్ణీత గడువులోగా అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పేద మహిళకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం



మహిళకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎంపీపీ సంతోష రూపవాణి, జెడ్పీటీసీ అరుణ

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): దుగ్గిరాల గ్రామానికి చెందిన పేద మహిళ అనారోగ్యం వల్ల ఇబ్బంది పడుతున్నదన్న విషయం తెలుసుకున్న మంగళగిరి శాసన సభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) రూ.50 వేల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. దుగ్గిరాల గ్రామ పరిధిలోని పేద మహిళ బొరుగడ్డ సుశీల ఇంటికి వెళ్ళి ఆ ఆర్థిక సహాయాన్ని ఆదివారం ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ మేకతోటి అరుణ అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దాసే శేషయ్య, కంచర్ల రవి, కర్రే కిరణ్, వాగోలు నరేంద్ర, పాముల కిషోర్, వెంకటేశ్వర నాయక్, మేరుగ ఆనంద తదితరులు పాల్గొన్నారు.

సూఫీ మహాత్ముల జీవన శైలి అలవర్చుకోవాలి

ఏపీ స్టేట్ మైనార్టీస్ కమిషనర్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్



దర్గాలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఏపీ స్టేట్ మైనార్టీస్ కమిషనర్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్

తాడేపల్లిరూరల్ : జీవితంలో సూఫీ మహాత్ముల జీవన శైలిని అలవర్చుకుంటే అన్నీ శుభాలే కలుగుతాయని ఏపీ స్టేట్ మైనార్టీస్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.ఇక్బాల్ అహమ్మద్ ఖాన్ చెప్పారు. ఆదివారం మంగళగిరి నవులూరు ఈఎస్సార్ గార్డెన్స్‌లో సుప్రసిద్ధ హజరత్ సయ్యద్ మాలిక్ హుస్సేన్ రెహమతుల్ అలై దర్గాలో ఉరుసు మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ సూఫీ మహాత్ములు భారతదేశానికి వచ్చి ఈ భూమిని పావనం చేశారని చెప్పారు. సమాజంలో శాంతి సమాధానాలు కోరుకునే వారు సూఫీ మహాత్ములు హజరత్ సయ్యద్ మాలిక్ హుస్సేన్, రెహమతుల్ అలై తెలిపిన బాటలో పయనించాలని కోరారు. దర్గా అనువంశిక ముజావర్ మొహమ్మద్ ఉస్మాన్ ఇస్లామ్ సంప్రదాయం ప్రకారం డాక్టర్ కె.ఇక్బాల్ అహమ్మద్‌ఖాన్‌కు స్వాగతం పలికారు. అనంతరం దర్గా ఇస్లామ్ పండితులు జాబేర్ హఫీజ్ ప్రత్యేక దువా చేశారు.

ప్రభూ.. 'ఫల'ప్రదాతా..



వెండిపాత్రను బహూకరిస్తున్న సంఘస్థులు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలోని లూథరన్ చర్చిలో ప్రథమ ఫలాలు పండగను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రథమ ఫలాల పండుగను పురస్కరించుకుని వెండి పాత్రను బహూకరించారు. ఈ సందర్భంగా బొందు జోసెఫ్ పారిస్ పాస్టర్ కడియం బుచ్చిబాబు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో అడిషనల్ పాస్టర్, సంఘ పెద్దలు పిల్లి నాగేశ్వరరావు, గంట జీవన్‌బాబు, కోటి మోజెస్, కొట్టే ఎలీషా పాల్, తడిగిరి సుధీర్, తోకల దుర్గాప్రసాద్, బంకా సుమతి, బస్సా సరళ, గూటాల రాజకుమార్, డి.మోహన్, సంజీవరావు, వర్లపార్ల కిషోర్, జి.సికింदర్, సుధాకర్, రవికుమార్, దాసరి సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఖిద్మత్ టీమ్ ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఖిద్మత్ అధ్యక్షులు షఫీ

తాడేపల్లిరూరల్ : మంగళగిరిలోని బాధితులకు ఖిద్మత్ టీమ్ ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందించింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు షఫీ మాట్లాడుతూ మంగళగిరి పట్టణానికి చెందిన ఆవుల పెద్దిరాజు, తిరుపతమ్మల కుమారుడు రంగస్వామి ఇటీవల రైలు ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో వైద్యులు ఆపరేషన్ చేసి కుడికాలు తొలగించారని, రంగస్వామి మందుల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సాయం అందించామని, అలాగే రంగస్వామి పెదనాన్న ధనకుల రామయ్య కూడా అనారోగ్యంతో చనిపోవడంతో అంత్యక్రియల నిమిత్తం గతంలో ఆర్థిక సహాయం అందించామని వివరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మూసా, ఖాదర్ వారి, సులేమాన్, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జ్ఞానమందిరం వార్షిక మహోత్సవాలు

వైభవంగా లక్ష్మీ గణపతి హోమం



మందిరంలో పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు, భక్తులు

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని రామసాయి జ్ఞాన మందిరంలో జరుగుతున్న వార్షిక మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 5.15 గంటలకు కాగడ హారతి, అనంతరం బాబా వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటలకు లక్ష్మీగణపతి హోమాన్ని రామసాయిట్రస్ట్ ప్రెసిడెంట్ సంకా సతీష్ దంపతులు, మహిళలు నిర్వహించారు. భక్తులు తెచ్చుకున్న పంచామృతములు, గంధం, ననీజవాలను హోమంలో వేశారు. బాబావారి శేష వస్త్రాలను వేలం నిర్వహించగా పలువురు భక్తులు వస్త్రాలను కొనుగోలు చేశారు. బాబావారిని ప్రత్యేకంగా అర్చకుడు శ్రీనివాసరావు అలంకరించి పూజలు జరిపారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమాన్ని ట్రస్ట్ ప్రెసిడెంట్ సతీష్, వైస్ ప్రెసిడెంట్ మలిశెట్టి శ్రీనివాస్, సంకా సీతారామయ్య, రవికుమార్, కొల్లిపర సీతారామకోటేశ్వరరావు, పోకల శివరామకృష్ణ, అకరంశెట్టి నాగేశ్వరరావు, అమరేంద్రప్రసాద్ పర్యవేక్షించారు.